

# అగాధాలు

భాస్కర స్వర్ణాంబ

"కంగ్రాట్స్ గౌరి!"

"థాంక్యూ సోమచ్."

"మీరు కథలు రాస్తారని నాకు తెలీదు సుమండీ. అమాంతంగా నిన్న మన సుబ్బారావు వచ్చి చెప్పాడు, మీకు ఒక ప్రసిద్ధ పత్రిక నిర్వహించిన కథానికల పోటీలో ఫస్ట్ ప్రైజు వచ్చిందని. నాకు ఒంట్లో బాగు

లేనందువల్ల నిన్ననే మీ దగ్గిరికి వచ్చి నా కంగ్రాట్సు చెప్పలేకపోయాను.''

''దానికేముందిలెండి. ఏదో అప్పుడప్పుడు కథలు రాస్తూంటాను. ఇదే మొట్టమొదట నేను పోటీకి కథ పంపడం. . . ''

''అన్నట్టు మీరు ఏమనుకోకుంటే ఒక్క మాట. నాకు ఎక్కువగా కథలు చదివే అలవాటు లేదు. అందుచేత వారపత్రికలు నేను కొనను. సుబ్బారావు ఆ పత్రిక తెచ్చిపెడతానన్నాడు. మీ దగ్గిర ప్రస్తుతం ఒక కాపీఉంటే ఇస్తారా?...నాకు ఇప్పుడేం పనిలేదు...''

రాజా ప్రశ్నకు సమాధానంగా, శౌరి వెంటనే తన టేబిల్ డ్రాయర్‌లోంచి తన కథ ప్రచురించబడిన పత్రిక తీసి ఇచ్చాడు.

రాజా ఆ పత్రిక పేజీలు తిరగేసి శౌరి కథ ఉన్న పేజీలు లెక్కపెట్టి, ''అబ్బో చాల పెద్ద కథే. ఈ కథ నేను చదివేసరికి కొన్ని గంటలు పట్టవచ్చు. ఆలస్యంగా ఇస్తే ఏమనుకోరుగదా?'' అన్నాడు నవ్వుతూ.

''నో, నో, ఎంత కాలమయినా ఉంచుకోండి'' అన్నాడు శౌరి.

రాజా థాంక్స్‌చెప్పి తన రూముకు వెళ్ళి ఫేన్‌స్విచ్ ఆన్‌చేసి బెడ్‌మీద కాళ్ళు పారజాపి పండుకొని కథ చదవడాని కుపక్రమించాడు.

* * *

''పక్కింటి వెంకట్రాముడు మంచి మార్కులతో పరీక్ష పాసయ్యాట్ట. ఇదేం ఖర్మమండీ, రెండో సారి కూడా ఈ గోపాల్‌గాడు పరీక్ష ఫెయిలయ్యాడు?'' సాగదీస్తూ సరస్వతమ్మ కాఫీ తాగుతున్న భర్తను ప్రశ్నించింది.

''నాకేం తెలుస్తుంది? ఏమిటో వాడు రానురాను శుద్ధ మొద్దవతారంగా తయారవుతున్నాడు. ఎన్ని మార్లు తిట్టను నేనుమాత్రం? ఇక వాడి కర్మకు వాడిని వదిలివెయ్యవలసిందే. . .'' రమణరావుగారు అన్న ఈ మాటల్ని, అప్పుడే వీధిలోనుండి ఇంట్లోకి రాబోతున్న గోపాల్ విన్నాడు. తల్లిదండ్రులు ఇంకా ఏం మాటాడుకుంటారో వినాలనిపించిందతనికి. అక్కడే వరండాలో చాటుగా నక్కి నిలుచున్నాడు.

''ఇలా వదిలేస్తే ఇక వాడు దేనికి పనికివస్తాడండీ? అయినా వాడికి చాలా పొగరెక్కింది. ఇటు ఇంట్లో ఓ పనికి సాయంలేదు. అటు తన చదువులో రాణింపు లేదు. ఛీ, ఛీ, ఎవరైనా చూస్తే 'ఈ సవతితల్లి వాడిని సతాయిస్తోంది' అంటారని అక్కడికీ నేను పల్లెత్తు మాట అనను కదా?. . .''

'అబద్ధం' అనుకున్నాడు వరండాలో నిలబడ్డ గోపాల్. 'పిన్ని ఎందుకిలా బాధ పెడుతూంది తనను? తను ఆవిడ చెప్పిన పనులు చెయ్యనిది ఎప్పుడు? ఎప్పుడూ బజారుపనులు, ఇంటిపనులు చేస్తూనే ఉంటాను కదా? అయినా నాన్న ఆవిడను గట్టిగా మందలించడు ఎందు చేత?. . .' ఇంతలో తన తండ్రి ఏదో చెబుతున్నాడు. చెవిఒగ్గి విన్నాడు గోపాల్.

''చూడు, ఇవ్వాల్టికి పోనివ్వు. నేను ఆఫీసుకు వెళ్ళాలి. వాడు ఇంటికి వస్తే ఇక ఏమీ అనకు.''

''ఇది మరీ బావుంది. నేనేం కన్నానా వాడిని. ఏమీ అనకనే ఇలా ఉంది. ఇంకా ఏదైనా అంటే ఏం చేసేవాడో! అయినా ఎవరికైనా చెయ్యవచ్చు చాకిరీ. అంతేకానీ, వాళ్ళని అనడానికి హక్కులేదు...'' రుసరుసలాడుతూ సరస్వతమ్మ లోపలికి వెళ్ళింది.

గోపాల్ వీధిలోకి వచ్చిపడ్డాడు.

ఎప్పుడూ ఉండే గొడవే ఇది ... తను పరీక్ష పాసవాలంటే ఎలా అవుతాడు? సరిగ్గా పరీక్షల సమయానికి పిన్ని ఆస్పత్రిలో పురిటికి చేరింది. ఆమె తల్లి తనను సరిగా చూడనేలేదు. హాస్పిటల్‌కూ, ఇంటికీ తిరగడానికే టైం చాలలేదు. ఇక ఎప్పుడు చదువుతాడు తను?

మామూలు రోజుల్లో కూడా ఏదో ఒక పని పురమాయిస్తూనే ఉంటుంది పిన్ని. ఎలాగ చదవడం? ఆలోచనలతో పరధ్యానంగా నడుస్తున్న గోపాల్ వెనక హారన్ వినబడ్డంతో ఉలిక్కిపడి పేవ్‌మెంట్‌పైకి తప్పుకున్నాడు.

కారుడ్రైవర్ కారాపి, గోపాల్‌ను చూచి, ''ఏమయ్యా, చావాలని ఉందా? అలా నడిరోడ్డు మీద నడుస్తున్నావేం?'' అంటూ గుడ్లురిమి చూశాడు. గోపాల్ మాటాడకపోయేసరికి అతను ఏదో గొణుక్కుంటూ కారు స్టార్ట్‌చేసుకొని వెళ్ళిపోయాడు.

గోపీకి అనిపించింది: 'డ్రైవర్ అన్నది నిజమే. . . తను ఎందుకు బ్రతకాలి? తల్లి ఎలాగూ లేదు. . .ఆ తల్లి చచ్చిపోయిన తరవాత తన తండ్రి దాయాది అయ్యాడు తనకు. . . నాన్న ఇంట్లో ఉన్నప్పుడు ఇలా ఉన్నా ఆయన అటు వెళ్ళగానే పిన్ని తన తడాఖా చూపిస్తుంది. ఇప్పటికి ఆరు సంవత్సరాలనుండి చూస్తున్నాడు. ఆమెలో మార్పులేదు. తను దానికి తగ్గట్టుగా ఈ ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్ష ఫెయిలవడం. ఇక తనకు ఎప్పుడు విముక్తి?'

ఆనాడంతా గోపాల్ ఇంటికి వెళ్ళకుండా చెరువు గట్టుపైన కూర్చుని ఆలోచించాడు.

సాయంత్రం ముఖం వేలవేసుకుని ఇంటికి వచ్చిన గోపాల్‌ను చూచి సరస్వతమ్మ ఉరిమింది.

''ఏమయ్యా, ఇల్లు కనపడిందా? నేను ఒక్కత్తినీ ఈ నీళ్ళు తోడుకోలేక, చాకిరీ చేసుకోలేక ఛస్తున్నాను. కూరగాయలు తెచ్చేవాళ్ళు లేరు. ఏవో సరుకులు కావలిసి వస్తే తేవడానికి ఎవరూ లేరు. ఏమిటి నీ ధోరణి?'' అంటూ ఆవిడ దండకం ప్రారంభించింది.

గోపాల్ మారుమాటాడక ఆ పనులన్నీ చేసిపెట్టాడు. దాంతో ఆవిడ కొంత శాంతించింది.

రాత్రిఅంతా ఆలోచించిన గోపీ మరునటి రోజు ఒక నిర్ణయానికి వచ్చాడు. 'తన తండ్రికి తనమీద సానుభూతిలేదు. సవతితల్లి అసలే గయ్యాళి. ఇక ఈ ఇంట్లో తను బ్రతకలేడు. ఈ ఇల్లు వదిలిపెట్టాలి, లేదా ఈ లోకమ్మైనా వదిలిపెట్టాలి. రెండో పని చేస్తే అంత గొప్పతనం ఏముంది? ఎలాగైనా ఇంట్లోనించి బయటపడి బాగా చదువుకోవాలి. ఈ బాధలు తీరితే అంతే చాలు ...'

* * *

రమణరావుగారు ఆ రోజు మామూలు వేళకు నిద్ర లేచారు. సరస్వతమ్మ దండకం చదువుతూంది, ''గోపాల్‌ను నిద్ర లేవమనండి· ఏడు గంటలవుతుంది. ఈ నీళ్ళు తోడలేక నా ప్రాణాలు పోతున్నాయి'' అంటూ. కానీ గోపాల్ గదిలోకి వచ్చి చూచిన

(తరువాయి· 34 వ పేజీలో)









ఇలా అన్నాడు:

"మా కంపెనీ జీతం ఎక్కువ చేసిందండీ. బోనస్ కూడా ఇస్తుందిట. ప్రతి నెలా నేను కొంత డబ్బు వెనక వేస్తున్నాను. బోనస్, అదీ అంతా కలిపి మీకు ఇస్తాను. మీరు నా చదువుకయిన ఖర్చుకోసం తీసుకోవాలి. ఇలా అంటున్నానని మరేమీ అనుకోకండి. డబ్బు ఇచ్చినంతమాత్రాన మీ ఋణం తీరిపోదు. అయినా అది నా కనీసధర్మం."

ఈ మాటలు విని ఆయన నవ్వారు.

"నీ ధర్మం మరోటి ఉందోయ్. ఆ ధర్మాన్ని ఇంత ఆలస్యంగా గుర్తు చేస్తున్నందుకు నాకు బాధగానే ఉందనుకో. అయినా మరేం ఫరవాలేదు. నీవు ఇప్పటికి ఒక వ్యక్తిగా సంఘంలో నిలబడగలిగావు. నీకు ఒక డిగ్రీ ఉంది. డబ్బు సంపాదించే యోగ్యత కలిగింది. నేనేదో నీకు సహాయం చేశాననీ, అందువల్లనే నీవు ఇంత వ్యక్తి అయ్యావనీ భావించుకుంటూ, ఆ ఋణం తీరుస్తానంటున్నావు. కానీ తీర్చవలసింది నాకు కాదు; మరో వ్యక్తికి. ఆయన ఇన్నిదినాలూ తెరవెనక ఉండి నిన్నింత వాణ్ణి చేశారు. నీవు మరోలా భావించనంటే నేను పూర్తిగా చెబుతాను." కాసేపు ఆగారు ఆయన.

"చెప్పండి. మీరు చెప్పిన మాట కాదంటానా?" అన్నాడు గోపీ...

"నాకు తెలుసు, ఎప్పుడో ఒకరోజు నీకీ మాట చెప్పవలసివస్తుందని. నీవెలా తీసుకుంటావో మరి!" అంటూ, ఆయన లోపలికి వెళ్ళి ఒక వార్తాపత్రిక, కొన్ని కవర్లు తెచ్చి గోపీముందు పడేశారు.

"ఇదేమిటండీ?" అన్నాడు గోపీ అర్థంకాక.

శ్రీనివాసరావు వార్తాపత్రిక తీసి అందులో ఒక పేజీలో ఉన్న ఒక ప్రకటనపై వేలుంచి చదవమన్నారు గోపీని.

అందులో ఇలా ఉంది:

"కనపడుటలేదు. . .

నాయనా, గోపీ, నీవు ఇల్లు విడిచిపోవడం ఏం బాగా లేదు. దయచేసి వెంటనే ఇంటికి రా! మీ పిన్నికూడ నీకోసం చాల బాధపడుతూంది.

తా. క. ఆఫీసు — నీ, తండ్రి

రాంపురం. — రమణారావు."

"ఏమిటండీ, ఈ ప్రకటన చాలా రోజులక్రితం వచ్చిందేగా? నేనూ చూశాను." అన్నాడు గోపీ.

"గోపీ, నీవు ఇలా ద్వేషం పెంచుకున్నావనే నీ తండ్రి బాధపడ్డారు. ఇదిగో, ఈ ఉత్తరాలు చదువు" అంటూ రెండు కవర్లు ఆయన గోపీకి అందిచ్చారు. ఒక ఉత్తరంలో ఇలా ఉంది:

"శ్రీ శ్రీనివాసరావుగారికి నమస్కారాలు. మీ ఉత్తరం అంది సంగతులు తెలిశాయి. మా అబ్బాయి గోపాల్ మీదగ్గిర ఉన్నట్టు వ్రాశారు. ఎలాగైనా ఆ అబ్బాయిని పెద్దవాణ్ణి చేసే భారం మీది. వాడు నామీద ద్వేషం పెంచుకున్నాడు. అందుకు నేనే బాధ్యుణ్ణి. వాణ్ణిగురించి ఏమీ పట్టించుకోక, ఇప్పుడు బాధపడితే ఏ లాభం? నాకీ శిక్ష అవసరం. వాడి సవతి తల్లి వాణ్ణి నానా బాధలు పెట్టింది. కన్నకొడుకు హృదయం తెలుసుకోలేని మూర్ఖుణ్ణి. మీరు గొప్పవారు. నాకంటే బాగా వాడి బాగోగులు మీరు చూడగలరని నా నమ్మకం. తరవాత తపాల్‌లో మీకు కొంత డబ్బు పంపుతాను. అది వాడి చదువునిమిత్తం వినియోగించండి. కానీ ఆ డబ్బు నేను ఇచ్చినట్టు వాడికి తెలియజెయ్యకండి.

రమణారావు."

మరో ఉత్తరం తరవాత సంవత్సరానికి వచ్చింది. అందులో ఇలా ఉంది:

"శ్రీనివాసరావుగారూ, గోపీ బుద్ధిగా చదువుతున్నందుకు చాల సంతోషం. నేను డబ్బు పంపినట్టు వాడికి తెలియజెయ్యకండి. అప్పుడప్పుడు వాడి క్షేమ సమాచారాలు తెలియజెయ్యండి. ఆమధ్య పేపర్లో కాలేజీ ఆటలపోటీల్లో గోపీకి ఛాంపియన్‌షిప్ వచ్చిందని చదివి ఆనందించాను. నేను వాడి అభివృద్ధి నిరోధకుణ్ణి. మీదగ్గిర ఉన్నందున వాడు అభివృద్ధిలోకి వచ్చాడు.

ఉంటా,

రమణారావు."

గోపీ ఉత్తరాలు చదివి మడతపెట్టాడు. చాలా సేపు ఆలోచిస్తూ కూర్చున్నాడు. అతని కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. "నేను ఆ నాడే పేపర్లో చూశానండీ. కానీ ఆ ఇంటికి వెళ్ళకూడదని నిర్ణయించుకున్నందున మనస్సు మార్చుకున్నాను. మా నాన్నకు నామీద ఇంత ప్రేమ ఉన్నదని నాకు తెలియదు. నన్నిప్పుడేం చెయ్యమంటారు?"

గద్గదస్వరంతో గోపీ అంటున్న మాటలు వింటూ కాస్సేపు అలాగే కూర్చున్నారాయన. "చూడు గోపీ, తమ సంతానంమీద అపేక్ష లేనివారుంటారా? ఏదో కోపంలో ఒక మాటంటే ఓర్చుకోవాలి పిల్లలు. పిల్లల్ని స్నేహితుల్లాగా చూసుకోవాలి తల్లిదండ్రులు. అంతేకానీ కోపతాపాలు పెంచుకొని ఇల్లువదిలి పారిపోయినస్తే తల్లిదండ్రులు ఎంత బాధపడతారో ఆలోచించరు చాలా మంది. వాళ్ళని అనడానికీ లేదు. ఆ వయస్సు అలా ఆవేశాన్ని కలగజేస్తుంది. నీవు బాధ పడవద్దు. ఇప్పటికైనా నీ తండ్రిమనసు తెలుసుకున్నావుగా. ఇప్పుడువెళ్ళి వెంటనే నీ తండ్రిని చూడటం నీ ధర్మం. ఒకసారి ఇచ్చిన తరవాత తిరిగి పుచ్చుకునే నియమం నాకు లేదు. ఈ డబ్బంతా నీపేర బాంకులో వేశాను. ఇదిగో పాస్‌బుక్. వెంటనే ఇంటికి వెళ్ళిరా. ఆనాడు ఆ ప్రకటన చూచి, నేనే మీ నాన్నకు జాబు వ్రాశాను. ఆయన ఉత్తరం నీవు చూశావు. తరవాత ఇటీవల నాకు ఆయన జాబు వ్రాయలేదు. వెంటనే వెళ్ళిచూడు."

శ్రీనివాసరావుగారి మాటలు గోపీలో చాలా సంచలనాన్ని కలిగించాయి. అతడు వెంటనే వాళ్ళ ఊరు ప్రయాణమయ్యాడు.

* * *

"ఏమండీ, ఈ వీధిలో రమణరావుగారని ఉండేవారు ఏడేళ్ల క్రిందట. ఇక్కడే ఉండేది వారి ఇల్లు...మీకు తెలుసా ఆయన ఎక్కడున్నారో?" తను వీధిలో అడుగుపెట్టి తాము నివసించిన ఇంటిస్థలంలో పెద్ద మేడ ఉండటంచూచి అనుమానంగా పక్కనున్న బంకు యజమానిని అడిగాడు గోపీ.

"ఎవరండీ? నల్లగా, సన్నగా ఉంటారే, ఆయనేనా? మతిస్థిరం లేదుకూడాను. ఆయన చనిపోయి రెండేళ్లయింది. ఆయన కొడుకు ఎవడో పరారీ అయిపోయాడట. దాంతో ఆయనకు దేహారోగ్యం చెడిందట. ఒక



మాతృదేవి

ఫోటో—ఎస్. షా అలీ (హైదరాబాదు)

దినం అకస్మాత్తుగా లారీకింద పడి చనిపోయాట్ట. అది ఆత్మహత్యో ఏమో అనుకున్నారు కొంతమంది. అయినా ఆ పిల్లవాడికేం పోయేకాలం?..." అంటూ చెప్పుకుపోతున్న బంకుయజమాని మాటలకు అడ్డప్రశ్న వేశాడు గోపీ. "మరి ఈ ఇల్లు?"

"ఆ ఇల్లు తాకట్టుపెట్టి ఆ డబ్బు కొడుక్కి పంపాడట. సరే, అప్పు తీర్చలేకపోయేసరికి వేలం వేసేశారు కాబోలు. భార్యాబిడ్డలు ఇక్కడెక్కడో వాళ్ల పుట్టింటికి పోయారట. పాపం ఆ ఇల్లాలికి ఈ సంగతులు ఇప్పుడే తెలిశాయట. మా ఇంటావిడ చెప్పిందిలెండి ఇవన్నీ . . . సరేగానీ ఇంతకీ మీ రెవరు? . . ."

బంకు యజమాని ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా గోపీ తన పిన్ని పుట్టిల్లు రంగవరం ప్రయాణం కట్టాడు.

* * *

"ఏమండీ, కథ వచ్చిందా?"

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు రాజా. ఎదురుగా గౌరి. "ఓహో, మీరా? నేను గమనించనే లేదు. చాల బాగుందండీ. . . కానీ సగంలో ఆగిపోయింది. ఆ సవతితల్లి అతన్ని క్షమిస్తుందా? మళ్ళీ అతను ఏమౌతాడు? ఇవన్నీ ప్రశ్నలుగా మిగిలిపోయాయే?" అన్నాడు రాజా.

"మీరేమీ అనుకోకపోతే ఆ గోపీ నేనేనండీ! మా పిన్ని ఇప్పుడు చాలా మారిపోయింది. నాతోనే ఉన్నారు వాళ్లందరూ. మా నాన్న నాకోసం అంత కష్టపడ్డాడు. ఆయనకు నా కృతజ్ఞత తెలుపుకోడానికికూడా నేను అనర్హుణ్ణి. తను అప్పులపాలై నా చదువుకు సాయం చేశాడు, నేను ఏమనుకుంటానో అని నాకు తెలీకుండా. .." గౌరి కండ్లవెంట నీళ్ళు కారిపోతున్నాయి.

అలాగే చూస్తూ నిలబడ్డాడు రాజా. ★